ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 16 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

16-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	38	27
బాపట్ల	38	28
రెంటచింతల	38	26
చీరాల	38	28

టీడీపీలో.. మినీ కోలాహలం

- 18 నుంచి నియోజకవర్గాల్లో నిర్వహణ
- స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు
- 22, 23 తేదీల్లో ఒక రోజు జిల్లా స్థాయి మహానాడు
- తుది దశలో సంస్థాగత ఎన్నికలు.. 23 కల్లా జిల్లా అధ్యక్షుల ప్రకటన



సత్తెనపల్లిలోని టీడీపీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో మహా సందడి మొదలైంది. ఒకవైపు కడపలో మహానాడు పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతుండగా.. అందుకు సన్నాహకంగా నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులకు ఎక్కడికక్కడ స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో తమ్ముళ్లలో మినీ మహానాడుల కోలాహలం నెలకొంది. ఒకవైపు మహాపండుగలా మహానాడును నిర్వహించేందుకు పార్టీ అధినాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కూడా మహానాడుల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జయంతిని పురష్కరించుకుని ఈ నెల 27 నుంచి కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు తరలివెళ్లేందుకు శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర మహానాడుకు సన్నద్ధతగా నియోజకవర్గాల్లో మహానాడుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర మహానాడుకు ముందుగా ఈ నెల 18 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహానాడులను నిర్వహిం చనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడుల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మినీ మహానాడులకు సంబంధించి తేదీలను కూడా ప్రకటించారు. మినీ మహానాడులలో ఆయా నియోజకవర్గాల పరిధిలో నెలకొన్న సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను చేస్తారు. వీటిని రాష్ట్ర మహానాడుకు నివేదిస్తారు. మినీ మహానాడుల అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో ఏదో ఒక రోజు జిల్లా మహానాడు నిర్వహిస్తారు. దీనికి ముందే పార్టీ జిల్లా కొత్త అధ్యక్షుడ్ని రాష్ట్ర పార్టీ నియమిస్తుంది. కొత్త అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లా మహానాడు జరుపుతారు.

మొదలైన సంస్థాగత సందడి

నియోజకవర్గాల్లో నిర్వహించే మహానాడుల కంటే ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేస్తారు. ఇప్పటికే గ్రామ, వార్డు, డివిజన్ స్థాయిలో ఈ ఎన్నికల ప్రక్రియ తుది దశలో ఉంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ కమిటీలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. రెండో దశలో ఈ నెల 18లోగా నగర, పట్టణ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల బాధ్యుల నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి అధిష్ఠానం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పరిశీలకులను ప్రత్యేకంగా నియమించింది. ఎన్నికల్లో పార్టీ కోసం పాటు పడిన వారికి అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వ నున్నారు. బూత్, క్లస్టర్ స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న వారికి పదవులు కేటాయించనున్నారు. ఆయా పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఎంపిక కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది.

పుర పాఠశాలలకు.. పోస్టులు



గుంటూరు : మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- అవసరమైన పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 190కిపైగా ఎస్‌ఏలు
- ఉన్నత పాఠశాలలకు ఇక పూర్తిస్థాయి హెచ్‌ఎంలు
- మున్సిపాల్టీల్లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీకి ఆమోదం

గుంటూరు (విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత కొన్నేళ్లుగా మెరుగైన ఫలితాలతో మున్సిపల్ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు పోటీ పడుతున్నాయి. అయితే ఉపాధ్యాయుల కొరతతో మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటిదాకా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులతో నెట్టుకొస్తున్న పాఠశాలలకు ఇక పూర్తిస్థాయిలో హెచ్‌ఎంలు రానున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో దాదాపు 17 ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13 మున్సిపాలిటీలు, గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 150 పైగా ఉన్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యా వలంటీర్లు లేదంటే ప్రాథమిక పాఠశాలల నుంచి ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై నియమించి విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. గుంటూరులో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా పూర్తిస్థాయి హెచ్‌ఎంలు లేరు. మరోవైపు పీఈటీల కొరత కూడా మున్సిపల్ పాఠశాలలను వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏటా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించేందుకు ఉపాధ్యాయులను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది అవసరమైన చోట ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తి స్థాయిలో నియమించుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ టూ హెచ్‌ఎం పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 9 మందికిపైగా పూర్తిస్థాయి హెచ్‌ఎంలు రానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 190కి పైగా స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులు భర్తీ కానున్నాయి. అవసరమైన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. త్వరలో షెడ్యూల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవ..

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నారా లోకేశ్ తాను ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుల కొరత గురించి స్వయంగా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల భర్తీకి ఆయన చొరవ చూపినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హైమారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దాదాపు 2000పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు మంజూరు చేశారన్నారు.

అధికారుల తీరుతోనే.. మంచి పేరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, చిత్రంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు

- సమన్వయంతో పనిచేస్తేనే విశ్వసనీయత
- గురజాల సమీక్షలో ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని
- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై జేసీతో విచారణ: కలెక్టర్ అరుణ్‌బాబు

పిడుగురాళ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో ప్రజాసమస్యలు పరిష్కరిస్తే అందరికీ మంచి పేరు వస్తుంది. మంచి ప్రభుత్వమని ప్రజల్లో విశ్వసనీయత కూడా పెరుగుతుంది. అధికారులు బాగా పనిచేస్తేనే ఎంపీగా తాను, ఎమ్మెల్యే యరపతినేని సక్సెస్ అవుతాము. ఆ లక్ష్యంతో అధికారులు పనితీరు ఉండాలి..' అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్), నియోజకవర్గ స్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడంతో పాటు అర్హులకు పథకాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి 20 మంది సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు.



సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు, నాయకులు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్

ప్రభుత్వ భూములపై విచారణ

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల లో ప్రభుత్వ భూములను ఆక్రమించి బ్యాంక్‌ల్లో రుణాలు పొందిన ఘటనలపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే యరపతినేని కోరారు. పొందుగలలో 150 ఎకరాల ఎద్దుల బీడుకు కొందరు పట్టాలు పొందారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల నష్టాలకు పరిహారం ఒక్కటే పరిష్కారం కాదని, కాలుష్యాన్ని తగ్గించి ప్రజారోగ్యం బాగుండేలా చూడాలన్నారు. మాచవరం మండలం పిల్లుట్ల సమీపంలోని ప్రభుత్వ భూముల్లో సున్నం, పల్వరైజర్స్ మిల్లులు, బట్టీల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గుత్తికొండ, భట్రుపాలెం, దైద ఆలయాలకు రహదారులు, మౌలిక వసతుల కల్పనకు అటవీశాఖ అధికారులు ఆమోదం తెలిపితే పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను పట్టాభూములుగా మార్చిన వైనంపై పులిచింతల ప్రాజెక్టు పీడీ, జేసీలతో విచారణ చేయిస్తామన్నారు. అధికారుల తప్పులు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, అటవీశాఖాధికారి కృష్ణప్రియ, ఆర్డీవో మురళీకృష్ణ, ఉపాధిహామీ పీడీ సిద్ధలింగమూర్తి, డీఎంహెచ్‌వో రవి, డీఏవో మురళి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం



ఆర్థిక స్వేచ్ఛ.. ఎప్పటికో?

- జీతాలు, బిల్లుల చెల్లింపులో జాప్యం
- మార్గదర్శకాల్లోనే మున్సిపాల్టీలకు అధికారాలు
- ఇప్పటికీ పాత పద్ధతిలోనే ఆర్థిక లావాదేవీలు
- రూపాయి ఖర్చుకు కూడా అనుమతి కోసం ఎదురుచూపు
- సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీల్లో ఆర్థిక వెతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు ఉన్నా.. మున్సిపాల్టీల్లో ఖర్చు చేసుకునే వెసులుబాటు లేదు. అత్యవసర పనులకు సైతం బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. ప్రజలు నుంచి ఆస్తి, నీటి, ప్రకటనల పన్నులను షాపింగ్ కాంప్లెక్సు లీజుల ద్వారా వచ్చే ఆదాయాలను మున్సిపాలిటీలు వసూలు చేస్తున్నా.. ఆ మొత్తాలపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదే. పేరుకు పురపాలక సంఘం.. ప్రత్యేక పాలనా వ్యవస్థ ఉన్నా.. ఆర్థిక స్వేచ్ఛ మాత్రం లేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఉద్యోగులకు జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించే పరిస్థితి నెలకొంది. మున్సిపాల్టీలకు అధికారాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే నెలలు గడుస్తున్నా ఈ మార్గదర్శకాలు అమల్లోకి రాలేదు. సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీలు ఆర్థిక వెతలను ఎదుర్కొంటున్నాయి. పంచాయతీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఆర్థిక స్వాతంత్య్రాన్ని కల్పించింది. దీంతో ప్రజలు చెల్లించే పన్ను, వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ అజమాయిషీ లేకుండా అభివృద్ధి పనులకు వినియోగిం చుకునే అధికారం పంచాయతీలకు వచ్చింది. ఈ పరిస్థితి మున్సిపాల్టీలకు లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రతి బిల్లు అప్‌లోడ్ చేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తేనే సీఎఫ్ఎంఎస్‌లో ఆ బిల్లు పాసవుతుంది. ఈ ప్రక్రియ అమలులో జాప్యం జరుగుతోంది. మున్సిపాల్టీల్లో అత్యవసర పరిస్థితుల్లో తాగునీరు, పారిశుధ్య పనులు చేయాల్సి వస్తుంది. ఇందుకు సంబంధించి బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీలను తప్పించేందుకు పలు ఆర్థికపరమైన అనుమతులు కావాలని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఆర్థిక పరమైన స్వేచ్ఛ కోసం మున్సిపాల్టీలు మరికొంత సమయం వేచి ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీలకు విముక్తి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని పురపాలకులు కోరుతున్నారు.

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి

6

అమరావతి రాజధానిని అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

8

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- డీఐఎల్ఆర్ఎంపీ వర్కుషాప్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ని వీక్షిస్తున్న మంత్రులు పెమ్మసాని, అనగాని, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

రైతు సేవలో.. నడికూడి యార్డు



నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

- మిర్చి కొనుగోళ్లతో సాగుదారులకు ప్రయోజనం
- తగ్గిన వ్యయప్రయాసల భారం.. కమీషన్ ఖర్చులు
- గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే విక్రయాలు



నడికూడి వ్యవసాయ మార్కెట్‌కు తరలి వచ్చిన మిర్చి టిక్కీలు

పిడుగురాళ్ల, దాచేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): గతంలో మిర్చి రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. గుంటూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకు రైతులు గురయ్యేవారు. అయితే నడికూడి మార్కెట్ యార్డు అందుబాటులోకి రావడంతో మిర్చి రైతులకు ఎన్నో ప్రయోజనాలు సమకూరుతున్నాయి. రైతులకు దూరాభారం తగ్గడంతో పాటు కమీషన్ల, మచ్చుకాయల భారం తగ్గింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డు తర్వాత అధిక ఆదాయం, రైతులు కలిగిన ప్రాంతంగా నడికూడి మార్కెట్ యార్డు ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. రైతుల ఇబ్బందులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు 2016-17లో నడికూడి మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడికే వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. నడికూడిలో మిర్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక ముందు గుంటూరుకు వెళ్లాలంటే ఒక్కో టిక్కీకి రూ.100 రవాణా వ్యయం, దిగుమతి ఆలస్యమైతే ఒకటి, రెండు రోజులు వాహనంలోనే లోడు ఉంటే అదనంగా అయ్యే ఖర్చులతో పెద్దమొత్తంలో రైతులు నష్టపోయేవారు. ఇక రోడ్డు ప్రమాదాల్లో ఎందరో బాధితులుగా మారారు. నడికూడి కేంద్రంతో ఈ కష్టాలన్నీ రైతులకు తప్పాయి. గుంటూరు మిర్చి యార్డులో శాంపిల్స్ సేకరణ అంటూ ఒక్కో టిక్కీ నుంచి మచ్చుకాయల పేరుతో కేజీల కొద్దీ అక్కడి వ్యాపారులు తీసుకునేవారు. ప్రస్తుతం నడికూడి మార్కెట్‌లో మచ్చుకాయల ఊసేలేదు. పైగా కమీషన్ కూడా గుంటూరు యార్డుతో పోలిస్తే నడికూడిలో చాలా తక్కువగానే ఉంది. ఇక్కడకు ప్రతిరోజు 500 శాంపిల్స్ 10 వేల టిక్కీలు వస్తుండటంతో స్థానికంగా కూలీలకు కూడా ఉపాధి లభిస్తుంది. ఈ విధంగా మిర్చి రైతులకు సేవలు అందిస్తూ ఆదాయ పరంగా ప్రభుత్వానికి రూకోట్లు సమకూర్చిపెడుతోంది.

పెరుగుతున్న ఆదాయం

2021 - 22లో రూ.6.16 కోట్లు, 2022-23లో రూ.6.82 కోట్లు, 2023-24లో రూ.7.21 కోట్లు, 2024-25లో రూ.7.38 కోట్ల ఆదాయాన్ని సాధించి జిల్లాలో మొదటి స్థానం, ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. ట్రెజరీ బ్యాలెన్స్‌లో రూ.27 కోట్లు నిల్వ ధనంగా ఉంది. ఇప్పటి వరకు గ్రేడు - 2గా ఉన్న మార్కెట్ యార్డు త్వరలో మార్కెట్ సెలక్షన్ కమిటీగా హోదా పెరగనున్నది. కమీషన్ ఏజెంట్లకు షాపుల ఏర్పాటుతో పాటు యార్డు చుట్టూ ప్రహరీ ఎత్తు పెంచడంతో పాటు సిబ్బంది కొరత సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

యార్డులో మిర్చి, ధాన్యం నిల్వలకు, రైతుల కోసం విశ్రాంతి గదులు లాంటి ఎన్నో సౌకర్యాలను ఏర్పాటు చేశాం. దిగుబడులను ఆరబెట్టుకునేందుకు విశాలమైన స్థలాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

-సూరె శ్రీనివాసరావు, కార్యదర్శి



స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరిస్తున్న అర్చకులు

వైకుంఠపురంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించి, పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నిత్య హోమం, ఆలయ బలిహరణ, శేష వాహన గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఈవో ఎం.అనుపమ, అర్చక సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.

గంజాయి కేసులో వారెంట్ ముద్దాయి అరెస్టు

తెనాలిరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతన్న వారెంట్ ముద్దాయిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన గండికోట గోపీ అలియాస్ పవన్ కల్యాణ్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో గంజాయి కేసు నమోదైంది. షరుతులతో కూడిన బెయిల్‌పై ఉన్న అతను 2023 నుండి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో మెజిస్ట్రేట్ నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఇవ్వడంతో గోపీని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. అతడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి శ్రామికుడి మృతి

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో గుండెపోటుతో ఉపాధి శ్రామికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మన్నవగ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ అలీషా (60) గురువారం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. పని ప్రదేశంలోనే అలీషాకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఏపీవో సుభాషిణీ, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక వైద్య సిబ్బంది పరీక్షించి అలీషా మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం!



బ్యాంక్ చైర్మన్ కే ప్రమోద్ కుమార్ రెడ్డి

దేశంలోనే అత్యధిక లాభార్జన కలిగిన, రాష్ట్రంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరిస్తోంది. దాదాపు నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పడిన ఈ ప్రాంతీయ బ్యాంకులో గ్రామీణులు, ముఖ్యంగా నిరక్షరాస్యుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. పాస్‌బుక్, ఏటీఎం, యూపీఐతో పనిలేకుండా ఖాతాదారుని మొహాన్ని స్కాన్ చేసి, నగదు విత్ డ్రా చేసుకునే మెషిన్‌ను ఏర్పాటు చేశారు. దీనంతటి వెనుక బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి కృషి ఉంది. బ్యాంకు సాధిస్తున్న ప్రగతి, నూతన సేవలపై ఆంధ్రజ్యోతి ఆయనతో ముచ్చటించింది.

- (గుంటూరు- ఆంధ్రజ్యోతి)

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి

● ఆంధ్రజ్యోతి: బ్యాంకుల విలీనం ఎందుకు?

చైర్మన్: నిన్నటి దాకా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు సేవలు అందించేవి. వాటన్నింటినీ విలీనం చేయడం ద్వారా బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందివచ్చు. అందుకోసమే విలీనం చేశాం. ఈ బ్యాంకుల విలీనం చేసి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. బ్యాంకు ప్రధానకార్యాలయం గుంటూరులోనే ఏర్పాటు చేశాం.

● ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలోనే పెద్ద నెట్‌వర్క్ ఉన్న గ్రామీణ బ్యాంకుగా చెప్పవచ్చా?

చైర్మన్: నాలుగు బ్యాంకుల విలీనం తర్వాత రాష్ట్రంలోని అతిపెద్ద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు నెట్‌వర్క్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరించింది. రాష్ట్ర జనాభా 5.2 కోట్లు కాగా, అందులో 23 శాతం మంది మా బ్యాంకులోనే ఖాతా కలిగి ఉన్నారు. రాష్ట్రంలో 1.27 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుతం 1,351 బ్రాంచులతో కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రాష్ట్రంలో మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా ఉన్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 167 ఏటీఎంలు ఉన్నాయి. బ్యాంకింగ్ కరెస్పాండెన్స్ విధానం ద్వారా 3,029 పాయింట్లలో ఖాతాదారులకు సేవలు అందజేస్తున్నాం.



ఫేస్ పే మిషన్..

● ఆంధ్రజ్యోతి: సాంకేతికంగా బ్యాంకు పురోగతి ఏమిటి?

చైర్మన్: బ్యాంకులో అందుబాటులోకి తెచ్చిన సాంకేతికత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఇప్పటి వరకు కమర్షియల్ బ్యాంకులు కూడా అందుబాటులోకి తీసుకురాని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం అందుబాటులోకి తెస్తున్నాం. బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం, ఆధార్, యూపీఐ యాప్ వేటితో సంబంధం లేకుండా ఖాతాదారుడు తనకు కావాల్సిన నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించాం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్, ఏటీఎం, యూపీఐ వినియోగంపై అంత అవగాహన ఉండదు. పైగా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లంటే ప్రజల్లో భయం ఉంటుంది. పోనీ బ్యాంకుకు వెళదామా అంటే అక్కడ పెద్ద క్యూ ఉంటుంది. అందుకని ఖాతాదారు బ్యాంకంటేనే భయపడే పరిస్థితి ఉంటుంది. అలాంటి వారు ఒట్టి చేతులతో వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకునేలా 'ఫేస్ పే' సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాం.

● ఆంధ్రజ్యోతి: ఫేస్ పే అంటే ఏమిటీ? దాన్ని ఎలా వినియోగించుకోవాలి.

చైర్మన్: అన్ని బ్యాంకులు ఏటీఎం, యూపీఐ వంటి సేవలు అందిస్తున్నాయి. వాటితో పాటు మనం ఫేస్ పే సదుపాయాన్ని తెచ్చాం. బ్యాంకులో నగదు విత్‌డ్రా చేసుకోవాలనుకునేవారు విత్ డ్రా ఫామ్ నింపడం, క్యూలో నిలబడటం వంటి సమస్యలను ఫేస్ పే లేకుండా చేస్తుంది. ఖాతాదారు ఫేస్ పే మిషన్ ఎదురుగా నించుంటే అది అతడి ముఖాన్ని స్కాన్ చేసుకుంటుంది. ఫొటో తీసుకుని సరిపోల్చుకుంటుంది. ఓకే అయిన తర్వాత ఖాతాదారు పేరు, పాస్‌బుక్ వివరాలు, ఖాతాలో నిల్వ మొత్తం తెలుగులో ఖాతాదారుకు వినిపిస్తుంది. విత్‌డ్రా సేవను చెబుతుంది. ఖాతాదారు తాను విత్‌డ్రా చేసుకోదల్చిన మొత్తాన్ని నమోదు చేశాక, దాన్ని కన్ఫార్మ్ చేసుకోవడానికి మరోసారి వినిపిస్తుంది. ఖాతాదారు ఓకే చేస్తే ఏటీఎంలో లాగా నగదు బయటకు వస్తుంది. నగదు లేకపోతే ఓచర్ వస్తుంది. ఆ ఓచర్ తీసుకుని బ్యాంకు సిబ్బందికి ఇస్తే వారు వెంటనే డబ్బు ఇస్తారు.

● ఆంధ్రజ్యోతి: లిమిట్ ఎంత వరకూ?

చైర్మన్: ప్రస్తుతం రూ. 25వేల వరకూ ఫేస్ పే ద్వారా విత్‌డ్రా చేసుకోవచ్చు. ముున్ముందు మరింత పెంచుతాం. దాంతోపాటు నగదు డిపాజిట్, ఇతర సదుపాయాలన్నీ అందుబాటులోకి తీసుకువస్తాం.

● ఆంధ్రజ్యోతి: ఎవరైనా ఖాతాదారు ఫొటో తెచ్చి మోసం చేయొచ్చు కదా?

చైర్మన్: అలా జరిగే అవకాశమే లేదు. ఫొటోలు పెడితే మిషన్ తీసుకోదు. అలాంటి మోసాలు జరగకుండా ఉండడానికి 'లైవ్‌నెస్ డిటెక్షన్'ను అమర్చాం. సజీవమైన మనిషి ఉంటేనే మిషన్ తీసుకుంటుంది.

● ఆంధ్రజ్యోతి: ఇలాంటివి ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

చైర్మన్: అన్ని చోట్లకు వీటిని అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల ఏర్పాటు చేశాం. గుంటూరు జిల్లాలో బ్రాడీపేట, మంగళగిరి, నంబూరు, యనమదలలో, పల్నాడు జిల్లాలో నరసరావుపేట, మోర్జంపాడు, కారంపూడి, ఫులిపాడు, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం, ఏలూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశాం. గుంటూరు బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన ఫేస్ పే మిషన్‌ను నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్. గోపాలం ప్రారంభించారు.



పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగ సంఘం నాయకులు

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి శిస్టు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు..గురువారం పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ చల్లా అనురాధను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వార్డు సచివాలయ ఉద్యోగుల ఉద్యోగోన్నతికి ఇచ్చిన జీవో నంబరు 523ను రద్దుచేయాలని కోరారు. ఉద్యోగోన్నతి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్, అంతకంటే ఎక్కువ ఉండే విధంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులకు వివిధ సంక్షేమ శాఖల్లో ఉద్యోగోన్నతులకు అవకాశం ఇవ్వాలని, రెగ్యులర్ విధానంపై మెప్మాలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా నియమించాలని, అర్హులకు కార్మిక శాఖలో అసిస్టెంట్ లేబర్ వెల్ఫేర్ అధికారులుగా అవకాశం కల్పించాలని ఇలా పలు డిమాండ్లను వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డైరెక్టర్ చల్లా అనురాధ వారికి హామీ ఇచ్చారు. సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థా మధు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి పార్థసారథి, కాకినాడ జిల్లా నాయకులు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



నాటిక పోటీలకు సిద్ధమైన వేదిక

నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

చిలకలూరిపేట, మే15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ సంయుక్తంగా శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సీఆర్ క్లబ్ కళా వేదికను సిద్ధం చేశారు. రాత్రి నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యవభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమాలలో స్థానిక సీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి కాంతయ్య, పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు పాల్గొంటారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18.50 కోట్ల పెట్ స్కాన్

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక పెట్ స్కాన్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.18.50 కోట్లు. పలు రకాల క్యాన్సర్ వ్యాధుల చికిత్సలో, వ్యాధి నిర్ధారణలో ఈ పరికరం ఎంతో కీలకం. రాష్ట్ర ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రికి పెట్ స్కాన్‌ను అందజేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ఈ పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి చేసి మరో నెల రోజుల్లో రోగులకు అందుబాటులోకి తెస్తామని జీజీహెచ్ అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రైవేటు క్యాన్సర్ హాస్పిటల్స్‌లో పెట్ స్కాన్‌కు రూ.25 వేలు, పేదలకు కన్‌సెషన్ కింద కనిష్ఠంగా రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చారిటీ ఆసుపత్రుల్లో రూ.8 వేలకు ఈ పరీక్ష చేస్తున్నారు. జీజీహెచ్‌లో పెట్ స్కాన్ పరీక్షలు ఉచితమా? నామమాత్రపు రుసుం తీసుకుంటారా అనేదానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ స్కాన్



విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేస్తున్న రాంబాబు నాయక్

పదిలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

బొల్లాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన డాక్టర్ జట్రావత్ రాంబాబు నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ పుట్టిన రోజు సందర్భంగా వినుకొండ - మాచర్ల నియోజకవర్గాల్లో ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మూడావత్ రమణానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంబాబు నాయక్ ఫౌండేషన్ చైర్మన్, సువర్ణ కుటీర డెవలపర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టి తల్లిదండ్రులను సంతోష పరచాలని సూచించారు. లక్ష్యం లేని విద్యార్థి ఏదీ సాధించలేడని, ముందు చూపు ఉన్నవాడు ముందకెళ్తాడన్నారు. నాయక్ 40వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు రూ.5వేలు చొప్పున స్కాలర్‌షిప్స్ అందజేశారు. ఐదేళ్లుగా సేవలు అందిస్తున్న రాంబాబు నాయక్‌ను పలువురు ఈ సందర్భంగా అభినందించారు. మేనేజింగ్ డైరెక్టర్ మర్రి సత్యనారాయణ, ప్రణవి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ విష్ణుమూర్తి నాయక్, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెంకటరావు, టీడీపీ రాష్ట్ర చైర్మన్ యువత రామకృష్ణ, ఓవర్సింగ్ ఎండీ అనిల్ చౌదరి, సువర్ణ కుటీర్ సీఈవో బాలూ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ నాయక్, జనరల్ సెక్రటరి రామ్‌నాయక్, కొండా నాయక్, ఏడుకొండలు నాయక్, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బర్మానాయక్, డాక్టర్ కె.సంధ్యా బాయి, జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు హనుమా నాయక్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

నరసరావుపేట కోర్టు సంచలన తీర్పు

నరసరావుపేట లీగల్, మే 15, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని 2023 మే 4న జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి ఉరిశిక్ష విధిస్తూ గురువారం స్థానిక పదమూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ సంచలన తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలు.. స్థానిక లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద షేక్ సలీమా(52) అనే మహిళ దారుణంగా హత్యకు గురైంది. తొలుత గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో ఆమె పట్టణంలోని ఎస్ఆర్కేటీ ప్రాంతానికి చెందిన మహిళగా తేల్చారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు తన్నీరు అంకమ్మరావు సలీమాను హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారు. అంకమ్మరావుపై మరో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయి.



తన్నీరు అంకమ్మరావు

మినీ మహానాడులు నిర్వహించాలి : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మినీ మహానాడులను నిర్వహించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఈ మినీ మహానాడులు వైభవంగా నిర్వహించాలని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకుల సూచించారు. రాష్ట్రాన్ని దుర్మార్గంగా పరిపాలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కబంధ రాక్షస హస్తాల నుంచి విడిపించేందుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చేసిన కృషి, పోరాటం ఫలితంగా బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కలయికతో అద్భుతమైన విజయాన్ని సాధించిన సందర్భంగా ఈ మినీ మహానాడులను ఘనంగా నిర్వహించాలని కోరారు. పార్టీ బలోపేతం, పరిపాలన పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, మార్గదర్శకమైన మార్పులపై నిర్ణయాత్మకమైన సలహాలు అందించాలన్నారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పమిడివారిపాలేనికి చెందిన గొర్రెలకాపరి ఇరుపన కోటేశ్వరరావు(38) చెరువులో పడి గురువారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బుధవారం కోటేశ్వరరావు గొర్రెలను పొలాలకు తోలుకొని వెళ్లాడు. మందను తన భార్యకు అప్పగించి.. ఇంటికి వచ్చి గేదెలను పొలానికి తోలుకొని వెళ్తుండగా అవి చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో కోటేశ్వరరావు పడిపోయాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోడంతో, ఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యి ఉండడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

దుర్గి, మే 15 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆత్మకూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుప్పాల అయ్యపురెడ్డి (42) తనకున్న రెండు ఎకరాల సొంత పొలంతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశారు. మూడేళ్లుగా గిట్టుబాటు ధర, దిగుబడి రాకపోవడంతో రూ. 15 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పుల తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపంతో గురువారం తన పొలంలో పురుగు మందు తాగాడు. పక్క పొలం రైతులు గమనించి అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పొలం వద్దకు చేరుకొని అయ్యపురెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై రాత్రి 10 గంటల వరకు పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ట్రాక్టర్ బోల్తా.. 25 మందికి గాయాలు

నూజెండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన 25 మంది గురువారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో జరిగిన సంస్మరణ కార్యక్రమాల్లో పాల్గొని, తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్ అదుపు తప్పి పడి పోవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నారిశెట్టి త్రిపుర సుందరరావు, మన్నెం చిన్న కోటయ్యను గుంటూరు తరలించగా నాగులపాటి శ్రీను, పెద రంగయ్య, కూచిపూడి రంగయ్య, నాగులపాటి కోటయ్య వినుకొండ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పల్నాడు వార్తలు

నడికూడి యార్డులో 5,300 టిక్కీల మిర్చి అమ్మకం

దాచేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 5,500 మిర్చి టిక్కీలు రాగా 5,300 మిర్చి టిక్కీల అమ్మకాలు జరిగాయి. మిర్చి 333 రకం రూ 8వేల నుంచి రూ 12,500, తేజా రకం రూ 9వేల నుంచి రూ 14వేలు, తాలుకాయలు రూ 2వేల నుంచి రూ 7వేలు అమ్మకాలు జరిగాయి.

దాచేపల్లి ఎంపీడీవోగా రవికుమార్

దాచేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ఎంపీడీవోగా పెద్దింటి రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లిలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై దాచేపల్లి ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న పప్పుల రత్నం ముప్పాళ్ళ మండలానికి బదిలీ అయ్యారు. వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య, నీటి ఎద్దడి లేకుండా చూస్తామని రవికుమార్ వివరించారు.

లింకు ఏఆర్‌టీ సెంటర్ ప్రారంభం

సత్తెనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా జీవించవచ్చని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఏరియా వైద్యశాలలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏఆర్‌టీ సెంటర్‌లో బీపీ, షుగర్, సిరం, రక్త శాతం పరీక్షలను లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ మందులు వాడే ప్రతి ఒక్కరు ఆరు నెలలకొక సారి బీపీ షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ ఆర్ఎంవో డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి నెల వైరల్ డీ, సీడీ-4, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఏఆర్‌టీ సెంటర్‌లో ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీబాషా, కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ సుభానీ, స్టాఫ్ నర్సు అనూష తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి
దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి రైతు అన్నదాత సుఖీభవ పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల ఏవో పీ వెంకటనరసయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సొంత పొలం ఉండి పాసుబుక్ కలిగిన ప్రతి రైతు పొలం ఉన్న గ్రామ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం జూన్ మాసంలో అందించే అన్నదాత సుఖీభవ పథకం డబ్బులను రైతుల ఖాతాల్లోనే జమ చేస్తుందన్నారు. ప్రతి రైతు ఈ నెల 20వ తేదీ లోపు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణమేళా వాయిదా

దుర్గి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన నిర్వహించాల్సిన ఎస్సీ కార్పొరేషన్ రుణమేళా వాయిదా పడినట్లు ఎంపీడీవో శివప్రసాద్ గురువారం తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

దుర్గి, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా దుర్గి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వేణుగోపి పోటీలను పర్యవేక్షించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేషన్‌కార్డులకు 67 దరఖాస్తులు

రెంటచింతల, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇప్పటివరకు నూతన రేషన్ కార్డుల కోసం 67 దరఖాస్తులొచ్చినట్లు తహసీల్దార్ మేరీ కనకం చెప్పారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ కాని కుటుంబసభ్యుల పేర్లు చేర్పునకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తే కుటుంబంలో ఉండే సభ్యుల వివరాలతో పాటు ఆరు నెలల నుంచి వారు తీసుకుంటున్న సరుకుల వివరాలు తెలుస్తాయన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల, మే 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.సరోజని దేవి కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్ జతచేయాల్సి ఉంటుందన్నారు. 26 మందికి అవకాశం ఉందన్నారు.

లోక్ జనశక్తి పార్టీ
జిల్లా అధ్యక్షుడిగా విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ

సత్తెనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్ జనశక్తి పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జొన్నలగడ్డ విజయ కుమార్ నియమితులయ్యారు. గురువారం పట్టణంలోని త్యాగరాజ మందిరంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చందోలు సత్యనారాయణ, విజయకుమార్‌ను నియమిస్తున్నట్టు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చింతా వెంకటేశ్వర్లు, ఇంతియాజ్, మహంకాళి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 15(ఆంధ్రజ్యోతి):పులిచింతల ప్రాజెక్టులో గురువారం22.60 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపా రు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతుందన్నారు.

పార్కింగ్ స్థలాలుగా మారిన సర్వీస్ రోడ్లు

దాచేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో సర్వీస్ రోడ్లన్నీ పార్కింగ్ స్థలాలుగా మారటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాచేపల్లిలో పార్కింగ్ స్థలాలు లేక సర్వీస్ రోడ్లే పార్కింగ్ స్థలాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు వాహనాలకు క్రమ పద్ధతిలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.



దాచేపల్లిలో సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం

● ప్రజల నుంచి అర్జీలు తీసుకున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్
● పిడుగురాళ్లలో 428 అర్జీలు



ఆర్వోబీ శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

పిడుగురాళ్ల, మే 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించిన తరువాత వారికి నేరుగా తెలియజేస్తామన్నారు. నిధులతో సంబంధం వున్నవాటిని పరిశీలించి ఆయా గ్రామాలకు నిధులు కేటాయిస్తామన్నారు. 2019-24 మధ్య కాలంలో గురజాల నియోజకవర్గంలో జరిగిన అనేక ఘటనలపై విచారణ జరిపిస్తామన్నారు. గతంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను కొందరు ఆక్రమించుకొని బ్యాంక్ రుణాలు పొందటంతో పాటు అదేమని అడిగినవారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే లక్ష్యంతో అభివృద్ధి దిశగా గురజాలను మార్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని గురజాల, మాచవరం, పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాలకు చెందిన పలువురు రెవెన్యూ, దేవదాయశాఖ, అటవీశాఖలకు సంబంధించిన అర్జీలతో పాటు రేషన్‌కార్డు, పింఛన్ల కొరకు ఎక్కువ దరఖాస్తులు అందాయి. మొత్తం 428 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మాచవరం మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు అంకమరాజు ఇంటి స్థలం కొరకు దరఖాస్తు ఇవ్వడానికి రాగా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే వేదిక నుండి వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. గ్రీవెన్స్ పూర్తయ్యాక ఎంపీ, కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే యరపతినేని స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాకు చేరుకున్నారు. ఆ సమయంలో చినఅగ్రహారానికి చెందిన కొమ్మనబోయిన సైదమ్మ అనే వృద్ధురాలు యరపతినేనిని చూసి మీతో తన సమస్య చెప్పాలని వుందనగా... ఆమె పక్కనే కూర్చొని సమస్యను విని రాసుకున్నారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు యరపతినేని సూచించారు.

ఆర్వోబీ శంకుస్థాపన

పట్టణంలోని జానపాడు రోడ్డులో సుమారు రూ.59కోట్లతో నిర్మించనున్న ఆర్వోబీ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, వున్నం నరసింహారావు, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కమిషనర్ శ్రీధర్, తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో రామచంద్రరావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, వడ్డవల్లి సాంబశివరావు, కటకం అంకారావు, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, గండికోట వెంకటేశ్వర్లు, కామిశెట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సైదమ్మ సమస్యను అడిగి రాసుకుంటున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పాలిటెక్నిక్‌లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

పిడుగురాళ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ పరీక్షా ఫలితాలలో పిడుగురాళ్లలో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత శిక్షణా కార్యక్రమంలో హాజరై అధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం స్థానిక జడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు అభినందించారు. 115/120 మార్కులు సాధించిన కె.హేమంత్‌కుమార్, 114/120సాధించిన షేక్ జాస్మిన్, 112/120 సాధించిన వి.నేహాశర్వాణి, 111/120 సాధించిన ఎం హర్షవర్ధన్, 108 మార్కులు సాధించిన హర్షవర్ధన్‌రెడ్డి, 107 మార్కులు సాధించిన భార్గవి, 102/120 మార్కులు సాధించిన యూ అఖిలను ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందిస్తూ మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, హెచ్ఎం ధనలక్ష్మీ, విజయసారథి పాల్గొన్నారు.

పశువుల దాణా, పశుగ్రాస విత్తనాల పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మనందరెడ్డి, అరవిందబాబు

కారంపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని పశువైద్యశాలలో గురువారం పశువుల దాణా, పశుగ్రాస విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎనిమిది టన్నుల పశువుల దాణాను 50 శాతం సబ్సిడీపై, 1000 కేజీల పశుగ్రాస విత్తనాలను 75శాతం సబ్సిడీపై అర్హతగల పాడి రైతులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె కాంతారావు, పిడుగురాళ్ల సహాయ సంచాలకుడు డాక్టర్ మోహన్‌రెడ్డి, కారంపూడి ఇన్‌చార్జి పశువైద్యాధికారి దిలీప్, గుంటూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు, కారంపూడి పశువైద్య అంబులెన్స్ డాక్టర్ రాగిడి శివ, కూటమి నేతలు పంగులూరి అంజయ్య, పుల్లయ్య, సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, ఉన్నం లక్ష్మీనారాయణ, శెట్టి హనుమంతురావు, చప్పిడి రాము, గోళ్ల సురేష్ యాదవ్, కర్నా సైదారావు, కుర్రి శివారెడ్డి, మునుగోటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా క్రీస్తు ఆలయాన్ని నిలబెట్టారు..

వెల్దుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు ఆలయాన్ని నిలబెట్టేందుకు అన్ని వర్గాల వారు కలిసికట్టుగా కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండలం మండాది ఎస్సీ కాలనీలో ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ నూతన క్రీస్తు మందిరం, కమిటీ హాలును ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 16 ఏళ్లుగా నిర్మాణ దశలో ఉన్న చర్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సంయుక్త ఆర్థిక సహకారంతో పూర్తిచేశారని సంఘ పెద్దలు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కుర్రి శివారెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు గుజ్జుల పాపిరెడ్డి, అంకిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాకాబందీ నిర్వహిస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

సమస్యలు సృష్టిస్తే కఠినచర్యలు

● ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన పల్లెల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో గురువారం నాకాబందీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. గృహాలను సోదా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధీర్ కుమార్ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎటువంటి అలజడులు సృష్టించకుండా అందరూ కలిసిమెలిసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరించినా, ఏవైనా సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లగడపాడులో కార్డెన్ సెర్చ్

పెదకూరపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లగడపాడు గ్రామంలో గురువారం వేకువజామున సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించగా సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, మూడు గొడ్డళ్ళు, ఆరు కత్తులు, రెండు బరిశలు, తొమ్మిది సంచుల గులకరాళ్ళను స్వాధీన పరుచుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణానికి ప్రజలందరూ సహకరించాలని అన్నారు. కొత్తవారు అనుమానాస్పదంగా సంచరిస్తే 100 నెంబరుకు గాని, సమీపంలోని పోలీసు స్టేషన్‌కు వివరాలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో క్రోసూరు సీఐ సురేష్, అమరావతి, అచ్చంపేట సీఐలు అచ్చయ్య, శ్రీనివాసరావు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, ముప్పాళ్ళ, బెల్లంకొండ ఎస్ఐ లు గిరిబాబు, రాజశేఖర్, వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాటుసారా అరికట్టేందుకు డ్రోన్ సర్వే



కృష్ణానది తీరంలో డ్రోన్ సర్వే చేస్తున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు

అచ్చంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): నాటుసారా అరికట్టేందుకు కృష్ణానది తీరంలో పలు తండాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసీ తెలిపారు. గురువారం మండలంలోని కృష్ణానది తీరంలోగల పుట్లగూడెం, తాడువాయి సమీపంలోగల సంద్ర తండా, బంగారు తండా గ్రామాల్లో నాటు సారా అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించిన అధికారులు డ్రోన్ సర్వే కూడా నదీ తీరంలో నిర్వహించారు. నాటుసారాతో పాటు గంజాయి, డ్రగ్స్ సేవించటంవల్ల ఆరోగ్యానికి కలిగే దుష్పరిణామాలను ఆయా గ్రామాల్లోని ప్రజలకు వివరించారు. డ్రోన్‌ద్వారా నిఘాపెట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా కేసుల్లో దొరికిన వారిపై పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు సేవించి జీవితాలను నాశనం చేసుకోకూడదని సంద్ర తండా, బంగారు తండాలోని వారికి వివరించారు. డ్రోన్ సర్వేలో అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



గురజాలటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను గత ఐదు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం పల్వారి సీతారామయ్య, నాగేశ్వరరావు ఆధ్వర్యాన స్వామివారి రథోత్సవం జరిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి వసంత సేవ నిర్వహించారు.

కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

క్రోసూరు, మే 15(ఆంధ్రజ్యోతి): టిక్కెట్ తీసుకొనే విషయంలో కండక్టర్‌కు, ప్రయాణికుడికి మధ్య వివాదం చెలరేగి కండక్టర్‌పై దాడి చేసిన సంఘటన గురువారం మండలంలోని విప్పర్ల గ్రామం వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నుంచి క్రోసూరుకు వచ్చే ఆర్టీసీ బస్సులో ఊటుకూరు గ్రామం వద్ద ఒక ప్రయాణికుడు ఎక్కాడు. టిక్కెట్ తీసుకోవటం కోసం ఫోన్‌పే చేయగా కండక్టర్‌కు చెల్లింపు జరగక పోవటంతో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఊటుకూరు నుంచి విప్పర్ల వచ్చేవరకు ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. విప్పర్ల రాగానే కండక్టర్‌పై దాడిచేసి ప్రయాణికుడు పారిపోయాడు. కండక్టర్ అలవాల పుల్లారావుకు కంటి భాగంలో గాయమైంది. ప్రయాణికుడు పేరు, వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు క్రోసూరు ఎస్ఐ పీ రవి బాబు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

బెల్లంకొండ, మే 15(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని తహసీల్దార్ షేక్ అస్రిఫున్నీసా బేగం పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను తహసీల్దార్‌తోపాటు ఎస్ఐ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బెల్లంకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించటం గర్వించదగ్గ విషయం అన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ గ్రామంలోని యువత కలసికట్టుగా క్రికెట్ పోటీలు నిర్వహించటం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహాయ సహకారాలతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్ మాట్లాడుతూ యువత క్రికెట్ పోటీలు కలసికట్టుగా నిర్వహించటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జానీ, మండల తెలుగు యువత అధ్యక్షుడు సలాం, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, సయ్యద్ జబ్బార్, పీఎస్‌కే రసూల్, ఎన్ పిచ్చయ్య, అహమ్మద్, రజాక్, సాగునీటి సంఘం చైర్మన్ ముస్తఫా, సుభానీ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ తదితరులు

ఉపాధి కూలీలకు పని భద్రత కల్పించాలి

పెదకూరపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు పని భద్రత కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు, పరస గ్రామాల్లో గురువారం ఉపాధికూలీలు చేస్తున్న పనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీటి వసతి, విశ్రాంతికి టెంట్లు, మెడిసిన్ కిట్లు ఏర్పాటుచేయాలని కోరారు. ఉపాధి కూలీలకు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

వెనుకబడిన మాచర్లను ఆదుకోండి

● సీఎం చంద్రబాబును అభ్యర్థించిన ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పురాతన ఆలయాలైన మాచర్ల పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, సత్రశాలలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభ్యర్థించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన నియోజకవర్గంలో జరగవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాలను సీఎంకు సమర్పించారు. అలాగే నియోజకవర్గంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. కారంపూడి, మాచర్ల మండలాల్లో నూతన పశువైద్యశాలలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కుర్రి శివారెడ్డి, పంగులూరి అంజయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

మాచర్లలో 19న మినీ మహానాడు



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యాన పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో ఈనెల 19వ తేదీన సాయంత్రం 4 గంటలకు మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర ముఖ్య అతిథులు పాల్గొంటారన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా టీడీపీ ప్రతియేటా నిర్వహించే మహానాడుకు మద్దతుగా నియోజకవర్గాల్లో మినీ మహానాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి మినీ మహానాడును జయప్రదం చేయాలని కోరారు.

కుంకలగుంటకు మహర్దశ

● పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ 8.10కోట్లు మంజూరు
● కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రూ.10కోట్లతో అభివృద్ధి పనులు



కుంకలగుంటలో డ్రెయిన్‌తో కూడిన సీసీ రోడ్లు

కుంకలగుంట(నకరికల్లు), మే 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో రూపురేఖలు మారుతున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలోని నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కుంకలగుంట మెయిన్‌రోడ్డు, సంతగుడిపాడు వెళ్ళే మార్గం నుంచి ఎర్రజాల కాలువ మీదుగా చేజర్లకు వెళ్ళే ప్రధానరహదారితో అనుసంధానం కోసం బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ జీవోను జారీచేశారు. కుంకలగుంటలోని మెయిన్ సెంటర్ ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్ మీదుగా ముప్పాళ్ళ వరకు రూ 4.10కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. కుంకలగుంట-ముప్పాళ్ళ రహదారి నిర్మాణంతో వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలకు రవాణా మార్గాన్ని కలుపుతుంది. దీంతోపాటు ఉపాధి నిధులతో గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం తుది దశకు చేరుకుంది. జలజీవన్‌మిషన్ ద్వారా రూ.92.80లక్షల నిధులు కేటాయించారు. రూ 10 కోట్ల మేర అభివృద్ధి పనులు సంవత్సర కాలంలోపే చురుగ్గా సాగుతున్నాయి. ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కృషి చేయటమేకాక అంతకుమించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మురుగుకాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు, రక్షిత తాగునీటి పథకాల అమలుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు: కనుమూరి బాజీచౌదరి

ఎన్నికల సమయంలో చెప్పినవిధంగా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక చొరవ చూపారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, పవన్‌కళ్యాణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో నిధులు కేటాయించటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పంపిణీకి సిద్ధంగా గడ్డి, జొన్న విత్తనాలు

క్రోసూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై పంపిణీకి గడ్డి, జొన్న విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల పశు వైద్యాధికారి సీహెచ్ మల్లయ్య గురువారం తెలిపారు. ఐదు కిలోల బ్యాగ్ 75శాతం సబ్సిడీ పోను రూ.115కి రైతులకు అందజేయనున్నట్టు తెలిపారు. మొత్తం రెండు టన్నులు గడ్డి విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశామని, అవసరాన్ని బట్టి ఇంకా తెప్పిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల నుంచి పశువులకు గొంతువాపు టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 1500 టీకాలు లక్ష్యం కాగా ఇప్పటికి 600 టీకాలు వేసినట్టు తెలిపారు.

తరగతి గదుల ఆధునికీకరణ

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): సినీహీరో మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మీ పేదవిద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న టీచ్ ఫర్ చేంజ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను ఆధునికీకరణ చేసి విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తిని పెంచేలా గోడలపై బొమ్మలను వేస్తున్నారు. మండలంలో 10 పాఠశాలలను ఎంపికచేసి అందులో ఓ తరగతి గదిని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. రంగులు పూర్తయ్యాక పెగా అకాడమీవారు తరగతి గదిలో విద్యార్థులకు కావల్సిన సామాగ్రిని అందజేసి ప్రతి వారం బోధనా సిబ్బంది వచ్చి విద్యార్థులకు క్లాసులు నిర్వహించనున్నారు. ప్రతి మండలంలో మోడల్‌గా పది పాఠశాలలను ఎంపికచేసి అందులో ఓ తరగతి గదిని ఆధునికీకరిస్తున్నారు.



లేమల్లెలోని పాఠశాలలో గోడకు వేసిన రంగులు, బొమ్మలు

అమరావతి రాజధానిని..
అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- నేను తమాషాగా చెప్పడం లేదు.. మీరే వెళ్లి చూడొచ్చు
- డీఐఎల్ఆర్ఎంపీ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'గుంటూరుకు 200 ఏళ్ల చరిత్ర ఉంది. అయినా కొన్నేళ్లుగా విస్మరణకు గురవుతోంది. అందుకే ఏ చిన్న అవకాశం వచ్చినా జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లు, సదస్సులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం.' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం వర్క్‌షాప్‌లో ఆయన జిల్లా చరిత్రని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రభుత్వ అధికారులకు నివేదించారు. ఈ జిల్లాలోనే అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తమ విజనరీ నాయకుడు, సీఎం చంద్రబాబు నేతృత్వంలో నిర్మిస్తున్నామని వివరించారు. దేశంలో మరో నగరం అమరావతిలా ఉండే అవకాశం లేదని కొనియాడారు. మరోసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఇలాంటి సదస్సుని అమరావతిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే అమరావతి రాజధాని నిర్మాణం జరగాల్సి ఉందని, 2019లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు అమరావతికి వెళ్లినా అక్కడ నిర్మాణం జరిగిన మూడు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు చూడొచ్చని, అవి అమెరికాలోని యూనివర్శిటీల కంటే బాగున్నాయంటూ కితాబిచ్చారు. అమరావతి అభివృద్ధి గురించి తాను ఏమి తమాషాలు చెప్పడం లేదన్న పెమ్మసాని, రాజధాని నిర్మాణం పూర్తి అయిన తర్వాత చూసి మీరే ఆశ్చర్యపోతారని ప్రతినిధులకు వివరించారు.


వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కన రెవెన్యూ మంత్రి అనగాని

2027కి రీసర్వే పూర్తి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా కేవలం భూమిని కొలవడం మాత్రమే కాదు, విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు బలమైన, ఆధునిక, సమగ్ర భూ రికార్డుల వ్యవస్థకు పునాది వేస్తున్నామని చెప్పారు. రీసర్వే జరిగిన ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి భూయజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. భూసర్వేపై సమగ్ర సమాచారాన్ని యజమానులకు అందించడానికి ప్రతీ బ్లాక్‌కు 50 నుంచి 70 మందిలో వాట్సాప్ గ్రూపులు కూడా ఏర్పాటు చేశామన్నారు. సర్వే షెడ్యూల్ వాట్సాప్, ఫోన్‌కాల్స్, రిజిష్టర్డ్ పోస్టు ద్వారా యజమానులకు ముందుగానే తెలియజేస్తున్నామన్నారు. ప్రతీ భూయజమాని వారి భూమి కొలత సమయంలో హాజరు కావడానికి మూడుసార్లు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. భూయజమానులు వ్యక్తిగతంగా హాజరు కాకపోతే వారి సరిహద్దులను గుర్తించడానికి వీడియో కాల్స్ ఆప్షన్‌ని కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. 2027 ఆఖరుకు రీసర్వే పూర్తి చేస్తామన్నారు.

రీసర్వేకు రూ.600 కోట్లు

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రెటరీ మనోజ్ జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమం కచ్చితమైన ప్రమాణాలతో వేగవంతంగా జరుగుతుందని ప్రశంసించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల సర్వే, రీ సర్వే కార్యక్రమం చాలా పురోగతిని సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేకి రూ. 600 కోట్ల వరకు ఖర్చు పెట్టిందని వెల్లడించారు. కేంద్రం త్వరగా తమకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ భూముల రీసర్వే, పట్టణాల్లో భూముల రీసర్వే కార్యక్రమమైన నక్షా ప్రక్రియకి సంబంధించి వివిధ దశలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనని ఆహ్వానితులకు చూపించారు. అలానే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లోనే..అధికారితో
ఉద్యోగిని అసభ్య ప్రవర్తన

- సీటీ శాఖలో హాట్‌టాపిక్‌గా వ్యవహారం
- ఉన్నతాధికారికి వీడియో దృశ్యాలు, విచారణకు ఆదేశం

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారి వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగానే చాంబర్‌లో అధికారితో మహిళా ఉద్యోగిని అసభ్యంగా ప్రవర్తంచడం వాణిజ్యపన్నుల శాఖలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం చూసిన సదరు ఉన్నతాధికారి వారిద్దరిని పిలిచి చీవాట్లతో సరిపెట్టినప్పటికీ ఇది కాస్త పైఅధికారుల దృష్టికి వెళ్లడంతో హాట్‌టాపిక్‌గా మారింది. సదరు ఉద్యోగులపై చర్యలు తప్పవని ప్రచారం జరుగుతోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం పూర్వపరాల్లోకి వెళితే... వాణిజ్య పన్నుల శాఖ గుంటూరులోని ఓ డివిజన్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ మూడు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదే సమయంలో మరో అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండగానే చాంబర్‌లోకి వచ్చిన ఓ మహిళా ఉద్యోగిని సదరు అధికారితో అసభ్యంగా ప్రవర్తించారు. ఇది చూసిన ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేసి ఇద్దరిని తన చాంబర్‌కు పిలిపించుకొని చీవాట్లు పెట్టినట్లు సమాచారం. ఇంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అంతా భావించారు. కానీ ఈ వ్యవహారం విజయవాడలోని ఉన్నతాధికారి దృష్టికి వెళ్లింది. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉద్యోగిని చేసిన అసభ్య ప్రవర్తనపై పుటేజీలతో సహా ఫిర్యాదు వెళ్లింది. దీనిని ఉన్నతాధికారి సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. మూడు రోజులుగా ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్నట్లు చెబుతున్నారు. వీడియో దృశ్యాలు, ఫిర్యాదును పరిశీలించి సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారి తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో సదరు అధికారి, మహిళా ఉద్యోగినిపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

కందుకూరులో రోడ్డెక్కిన పొగాకు రైతులు

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యాపారులు రోజురోజుకి ధరలు దిగజారుస్తున్నారంటూ నెల్లూరు జిల్లా కందుకూరులో రైతులు అందోళన బాటపట్టారు. గురువారం వేలం ప్రక్రియ ప్రారంభమయ్యాక ధరలు దారుణంగా తగ్గిపోతున్నాయని గుర్తించిన రైతులు వేలంను నిలిపివేసి వేలంకేంద్రం బయట రోడ్డుపై బైఠాయించారు. దూబగుంట సమీపంలో ఉన్న కందుకూరు-1 వేలం కేంద్రంలో ఆందోళన చేపట్టిన రైతులు కందుకూరు - కనిగిరి ప్రధాన రహదారికి ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేశారు. చెన్నిపాడు, బాలిరెడ్డిపాలెం రైతులు మాట్లాడుతూ వేలం ప్రారంభించిన సమయంలో నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర రూ.280గా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు కొద్దిరోజులు గడిచాక అతికొద్ది బేళ్లకు మాత్రమే ఆ ధర చూపిస్తూ అత్యధికశాతం నాణ్యమైన బేళ్లకు రూ.250లకే సొంతం చేసుకుంటున్నారని మండిపడ్డారు. బోర్డు అధికారులు రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

తెలుగువారి గుండెల్లో..
చెరగని సంతకం ఎన్టీఆర్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు

పెదనందిపాడు, మే, 15 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో చెరగని సంతకం ఎన్టీఆర్ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్ జగన్ నిర్లక్ష్యం వల్లే గ్రామాలు అంధకారంలో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం అందించిన సహాయాన్ని జగన్ ప్రభుత్వం తీసుకోపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులను సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న నిధులను వినియోగించుకుంటూ తీరుస్తూ, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కిలో బియ్యం రెండు రూపాయలకే ప్రవేశపెట్టి, పేదవారి కడుపు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన చేసిన మంచిని ముందు తరాలకు కూడా తెలియజేయాలన్నారు. అనంతరం విగ్రహ కమిటీ నిర్వాహకులు పెమ్మసాని, బూర్ల, లావులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. తొలుత లక్ష్మీపురం వద్ద నుండి ప్రచార వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్దకు చేరుకొని అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు వందనాదేవి, జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, తాళ్ల వెంకట యాదవ్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, స్థలదాత కాపు వెంకటసుబ్బారావు, విగ్రహదాత జాలాది నాగప్రసాద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు వేళాయే

- నేటి నుంచి జూన్ 2వ తేదీ వరకు అవకాశం
- జూన్ 3 నుంచి నిషేధం అమల్లోకి
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ ఖరారైంది. ట్రాన్స్‌ఫర్లపై ఉన్న నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు సడలిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. నిర్దిత సమయంలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, జూన్ 3 నుంచి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. ఉద్యోగుల సంక్షేమం, వారి ఉద్యోగ జీవితాన్ని సమతుల్యం చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ప్రజలకు సేవ చేయడంలో ఉద్యోగులు సరైన పోస్టులలో ఉండేలా చూసేందుకు బదిలీలు చేస్తున్నామని తెలిపింది. మే 31వ తేదీ లోపు ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల పాటు ఉన్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. వ్యక్తిగత విజ్ఞాపన మేరకు కూడా ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీలు చేయొచ్చు. 2026 మే 31 లోపు రిటైర్డు అయ్యే ఉద్యోగులను బదిలీ చేయరాదు. ఒకవేళ వారు కోరుకొంటే చేయొచ్చు. అలానే పరిపాలన సౌలభ్యం కోసం కూడా బదిలీ చేసే అవకాశాన్ని కల్పించింది.

వారికి ప్రాధాన్యం

బదిలీల్లో అంధ ఉద్యోగులు, బుద్ధిమాంద్యం, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసిన వారు, 40 శాతం వైకల్యం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. మెడికల్ గ్రౌండ్స్ ఆధారంగా బదిలీలు కోరుకుంటున్న వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కారుణ్య నియామకం పొందిన మహిళా ఉద్యోగులకు కూడా బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. అంధ ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయింపు ఇస్తారు. ఒక వేళ వాళ్లు బదిలీ కోరుకొంటే స్పష్టమైన ఖాళీ ఉంటే బదిలీ చేయొచ్చు. భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో పోస్టింగ్ చేయాలి. ఒకవేళ వీలు పడకపోతే సమీపంలోని గ్రామంలోనే పోస్టింగ్ చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా నిర్వహించాలి..

బదిలీలు పారదర్శకంగా చేయాల్సిన బాధ్యతని సంబంధిత ప్రభుత్వ శాఖ జిల్లా అధికారిపై ప్రభుత్వం ఉంచింది. బదిలీల్లో ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలు రావడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన అసోసియేషన్లలో ఆఫీసు బేరర్లుగా ఉన్న ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయించాలి. ఈ విషయంలో మూడు పర్యాయాలు/9ఏళ్ల స్టే నిబంధనని పాటించాలి. ఆఫీసు బేరర్ల జాబితాను సంబంధిత హెచ్‌వోడీలకు కలెక్టర్ ద్వారా ఆయా అసోసియేషన్లు పంపించాలి. అయితే ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీ చేసే అధికారాన్ని పరిపాలన సౌలభ్యం కోసం కాంపిటెంట్ అథారిటీకి కేటాయించింది. ఏవైతే డిపార్టుమెంట్లకు ఏకీకృత ఆపరేషనల్ సిస్టమ్స్ ఉన్నాయో ఆయా శాఖలు విధిగా మార్గదర్శకాలు జారీ చేయొచ్చు.

ఆదాయం ఉన్నా..
అభివృద్ధి సున్నా

- అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్ యార్డు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నిజాంపట్నంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

రేపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా కూచినపూడి మార్కెట్ యార్డు అభివృద్ధిని పాలక యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి యార్డు అద్దె భవనాల్లో కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నియోజకవర్గం రద్దు కాకముందు ప్రత్యేక మార్కెట్ యార్డు కావాలని ఈ ప్రాంత రైతులు కోరారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్ యార్డును మంజూరు చేశారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి జిల్లాకు చెందిన మంత్రులు కాసు కృష్ణారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, మోపిదేవి వెంకటరమణరావు అట్టహాసంగా యార్డును ప్రారంభించారు. కానీ, ఆ తర్వాత దానిపై దృష్టి సారించిన వారే కరువయ్యారు. నిజాంపట్నం మండలం కూచినపూడిలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నుంచి మార్కెట్ యార్డును నిజాంపట్నం తరలించారు. ప్రస్తుతం అక్కడ కూడా అద్దె భవనంలోనే మార్కెట్ యార్డు కొనసాగుతోంది. కనీసం మార్కెట్ యార్డుకు ఒక్క గోడౌన్ కూడా లేదు. ఈ మార్కెట్ యార్డు పరిధిలో వందలాది గ్రామాల్లోని రైతులు వినియోగించుకుంటారు. ఒక్క గోడౌన్ కూడా లేకపోవటంతో పండించిన పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం వస్తున్నా కనీసం యార్డుకు స్థలసేకరణ చేసిన దాఖలాలు లేవు. గోడౌన్ గత వైసీపీ పాలకులు విస్మరించారు.


అరకొర వసతులే

కూచినపూడిలో అరకొర వసతుల మధ్య మార్కెట్ యార్డు భవనం కొనసాగుతోంది. గతంలో కూచినపూడి, లింగినేనివారిపాలెం మధ్యలో కొంత భూమిని పరిశీలించారు. అది ప్రధాన రహదారికి దూరంగా ఉందని విరమించుకున్నారు. యార్డు తొలి అధ్యక్షుడిగా రావి సాంబశివరావు విధులు నిర్వహించారు. యార్డు నిర్మాణానికి పాలకవర్గం చేసిన అభివృద్ధి నామమాత్రమే. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు చైర్మన్‌ను నియమించారే తప్పా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. రైతులకు మేలు చేసిందేమీ లేదని తీరప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పల్లపట్ల సమితి భవనాన్ని మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించ లేదు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందాన పరిస్థితి ఉంది. రైతులు పండించిన ధాన్యాన్ని గోదాముల్లో భద్ర పరిచి గిట్టుబాటు, దర వచ్చి విక్రయాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. కానీ గోదాములు లేకపోవడంతో ఆ పథకం పడకేసింది. కూటమిప్రభుత్వం అధికారం చేపట్టటంతో ఇటీవల మార్కెట్ యార్డు చైర్మన్‌ల నియామకం జరిగింది. టీడీపీ నిజాంపట్నం అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్‌ను మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి పాలనలోనైనా యార్డును అభివృద్ధి చేస్తారని, పక్కా భవనాలను కల్పిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు

ఏటా రూ.కోట్లలో రాబడి

మార్కెట్ యార్డు పరిధిలో చెక్‌పోస్టుల ద్వారా మొదటి ఏడాది రూ.50 లక్షలు ఆదాయం వచ్చింది. తర్వాత నుంచి ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.2 కోట్ల మేరకు ఆదాయం చేరింది. వసతుల కల్పనలో అధికారులు, పాలకులు తీసుకున్న చొరవ ఎక్కడా కనిపించడం లేదు. గోదాము నిర్మిస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో కూచినపూడిలో ఉన్న యార్డును రేపల్లె - నిజాంపట్నం ప్రధాన రహదారి పక్కన ఉన్న పల్లపట్ల సమితి కార్యాలయానికి మార్చాలనే ప్రతిపాదన పెట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందచేశారు. ఆ తర్వాత పురోగతి లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని మార్కెట్‌యార్డు పల్లపట్ల సమితి భవనంలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని రైతులు, తీరప్రాంత వాసులు కోరుతున్నారు.

నృసింహుని దర్శించుకున్న మీనాక్షి లేఖి


కేంద్ర మాజీమంత్రి మీనాక్షి లేఖితో మంగళగిరి బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మీనాక్షి లేఖి గురువారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. ఆమెకు బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. తొలుత దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎగువ సన్నిధిలో పానకాల స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, నేతలు నాగలక్ష్మి, గీతా మాధురి, విజయవాణి, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల దుర్గారావు, రాకేష్‌జీ, మణికంఠ, కాండ్రు భానుకిషోర్, కమల కృష్ణ, రామమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 17, 18 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07441) చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు నడికుడి, 6.40కి గుంటూరు, ఆదివారం వేకువజామున 3.35కి విశాఖపట్టణం చేరుకొంటుంది. (07442) విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 18న ఆదివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 6 గంటలకు గుంటూరు, 7.10 గంటలకు నడికుడి, 11.40కి చర్లపల్లి చేరుకొంటుందని తెలిపారు.


వర్షంలో చిన్నారుల చిందులు


వర్షపు నీటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ..



పట్టాభిపురం రోడ్డులో గాలి దుమారంలో పడిపోయిన బారికేడ్లు

మండుతూనే..ముంచెత్తింది..!

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేసవి మంట పుట్టించింది. ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రానికి నాలుగు గంటల నుంచే ఆకాశం మేఘావృతమైంది. ఒక్కసారిగా గాలి, ఉరుములు, మెరుపులతో జోరు వర్షం కురిసింది. దాంతో నగరమంతా తడిసి ముద్దయింది. అర్ధగంట పాటు జోరు వర్షం కురవడంతో కొన్ని దిగువ ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ప్రజలకు అసౌకర్యం కలిగించింది. గురువారం ఉదయం నుంచే ఎండ వేడిమి మొదలైంది. మధ్యాహ్నానికి ఎండ ప్రతాపం చూపుతూ వడగాలులు సైతం ప్రజల్ని ఆందోళనకు గురిచేశాయి. వేసవి తాపం తట్టుకోలేక ప్రజల రాకపోకలు మధ్యాహ్నానికే మందగించాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచే వాతావరణంలో మార్పు వచ్చింది. జోరు వర్షానికి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు పరుగులు పెట్టారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

యడ్లపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయభారతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు హాజరై తప్పిన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి 26వరకు ఈ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12..45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 19న తెలుగు, 20న హిందీ, 21న ఇంగ్లీషు, 22న గణితం, 23న ఫిజికల్ సైన్సు, 24న బయాలాజికల్ సైన్స్, 26న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించి పొందవచ్చని తెలిపారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు రూ.50లు అదనంగా చెల్లించి హాల్ టిక్కెట్లు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

ఏపీఈసెట్‌లో 94.77 శాతం ఉత్తీర్ణత

నరసరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించిన ఏపీఈసెట్ పరీక్షల్లో జిల్లాలోని విద్యార్థులు 94.77శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా నుంచి 535మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 383మంది పురుషులు.. 152మంది మహిళలు ఉన్నారు. మొత్తం 507మంది ఉత్తీర్ణులుకాగా వీరిలో 363మంది పురుషులు, 144మంది మహిళలు ఉన్నారు. పురుషులు 94.78శాతం, మహిళలు 94.74 శాతం ఉత్తీర్ణత సాధించారు.

19 గ్రామాలలో విద్యుత్ అధికారుల దాడులు

చిలకలూరిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సెక్షన్ రూరల్ పరిధిలోని 19 గ్రామాలలో 44బ్యాచ్‌లుగా విద్యుత్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అనధికారికంగా అధిక లోడు, విద్యుత్ వినియోగం చేసుకుంటున్న150 సర్వీసులను గుర్తించి రూ.6లక్షలు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న 4 సర్వీస్‌లకు రూ.1,20,000, విద్యుత్ కనెక్షన్ బిల్లింగ్‌లలో తేడా గమనించిన ఒక సర్వీస్‌కు రూ.30,0000 అపరాధ రుసుం కింద జరిమానా విధించారు. విద్యుత్ శాఖ సీఆర్‌డీపీ సర్కిల్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో గుంటూరు టౌన్ 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు, డీపీఈ, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. దాడులలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎ.గురునాథరావు ఎన్.మల్లికార్జునప్రసాద్, కె.రవికుమార్, 11 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారని చిలకలూరిపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.అశోక్ కుమార్, చిలకలూరిపేట రూరల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సురేష్ తెలిపారు.

బహిరంగంగా మద్యంపానం: ఒకరి అరెస్టు

ఈపూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మండల కేంద్రమైన ఈపూరులో డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మద్యం దుకాణాలలో అమ్మకాల గురించి డెకాయ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, ప్రభుత్వం నిబంధనకు విరుద్ధంగా మద్యం విక్రయించినా చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కే.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు

శావల్యాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు, కొత్తలూరు, మతుకుమల్లి గ్రామాలలో టీడీపీ నూతన గ్రామకమిటీ ఎన్నికలను గురువారం నిర్వహించారు. వేల్పూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఓబూరి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా పొట్లపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి ఏడుకొండలు ఎన్నికయ్యారు. కొత్తలూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా తిరువీధి రవిశంకర్, ఉపాధ్యక్షుడిగా ఒత్తుల చినఅంజయ్య, ప్రధాన కార్యదర్శిగా సిద్దెల మోషే ఎన్నికయ్యారు. మతుకుమల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా పాపసాని సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా పాలవ ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ పెదలాలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సీనియర్ నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గసభ్యులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బోయపాలెం విద్యార్థికి ఏపీ ఈసెట్‌లో 237వ ర్యాంకు

యడ్లపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈసెట్ ఫలితాలలో మండలానికి చెందిన విద్యార్థిని దోరడ్ల సత్యవెంకట నాగలక్ష్మీ ప్రణతి 237వ ర్యాంకు సాధించింది. మండలంలోని బోయపాలెం గ్రామానికి చెందిన మల్లికార్జునరావు, సౌజన్యల రెండో కుమార్తె ప్రణతి గుంటూరులోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా (కంప్యూటర్ సైన్స్) చదువుతోంది. ఈ నెల 6వ తేదీన జరిగిన ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్ష (ఏపీ ఈసెట్)కు రాష్ట్రవ్యాప్తంగా 35వేల మంది హాజరు కాగా ప్రణతి కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్ విభాగంలో 237వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 292 ఇంటిగ్రేటెడ్ ర్యాంకు సాధించింది.

ప్రతి ఏటా 5 లక్షల టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేస్తాం

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన తదితరులు

వినుకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలందరికీ మొదటి ఏడాదిలోనే ఐదు లక్షల టిడ్కో ఇళ్లను అందజేయడం జరుగుతుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన టిడ్కో గృహాలను వైసీపీ ప్రభుత్వం పనులు పూర్తిచేయకుండా నిలిపివేశారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత శరవేగంగా పనులు పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన గుత్తేదారులతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. శుక్రవారం జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహసముదాయాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో 2లక్షలు, గ్రామాల్లో 3 లక్షల ఇళ్లు ఎన్‌టీఆర్ హౌసింగ్ పథకం కింద శరవేగంగా పూర్తవుతున్నాయని, త్వరలో లబ్ధిదారులకు అన్నివసతులతో కూడిన కొత్త ఇంటి తాళాలు అందజేస్తామన్నారు. పేదలందరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గృహ నిర్మాణాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. వినుకొండలో మొత్తం టిడ్కో ఇళ్లను 5 నుంచి 6 నెలల్లో పూర్తి చేస్తామని, 720ఇళ్లు ఇప్పటికే 90శాతం పూర్తయ్యాయని, 300 చదరపు అడుగుల ఇంటిపై రూ.6.50లక్షలు, 430 చ.అ. ఇంటికి రూ.8.55లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం మీద 2లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి 7వేల కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. పేదవారంటే చులకన, నిర్లక్ష్యం కారణంగానే గత వైసీపీ ప్రభుత్వం ఇలా కొత్త ఇళ్లు కట్టకపోగా మంజూరైన ఇళ్లను కూడా రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిలో ముందు, పేదల చేయూతలో వెనుక నిలిచిన వారు కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్ర వాటా నిధులు ఇవ్వాల్సి వస్తుందని 51వేల టిడ్కో ఇళ్లను రద్దు చేశారని మండిపడ్డారు. జగన్ నిర్వాహకం కారణంగా 77,600మందికి ఇళ్లు ఇవ్వకుండానే రుణాలు తీసుకున్నారన్నారు. లబ్ధిదారులు ఈఎంఐలు కట్టలేక పేదలు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. గత ప్రభుత్వం కట్టని ఆ అప్పుల భారం తీర్చేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.140కోట్లు అప్పు తీర్చిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే 50 నుంచి 90శాతం పూర్తిచేసిన ఇళ్లను ఎందుకు పేదలకు ఇవ్వలేకపోయారని నిలదీశారు. ఆ నిర్వాకాలన్నీ సరిచేయడంతో పాటు ఇంకా ఇళ్లు లేనివారికి పట్టణంలో 2, గ్రామాల్లో 3సెంట్లు చొప్పున స్థలాలు ఇచ్చి ఎన్‌టీఆర్ కాలనీ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను పూర్తిచేసి తీరుతామన్నారు. గృహనిర్మాణానికి ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ బీసీలకు రూ.50వేలు అదనపు ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. గూడులేని పేదలకు ఇళ్లు అందించాలని ఎన్‌డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, జనసేన నాయకుడు నాగశ్రీను, కౌన్సిలర్ షకీలా, లింగమూర్తి, పి.వి.సురేష్, దీకొండ ఆచారి, నరసింహారావుతో పాటు టీడీపీ నాయకులు, గృహనిర్మాణ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

వినుకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీడీసీసీబీ చైర్మన్‌గా మక్కెన ఎంపికపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి, పలు అంశాలను క్షుణ్ణంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కూడా కలిశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ నారా లోకేశ్, బాలకృష్ణలను కలవటం ఆనందంగా ఉందన్నారు.



మంత్రి లోకేశ్‌తో జీవీ, మక్కెన

జఠిలంగా ముక్కెళ్ళపాడు అసైన్డ్ భూముల వ్యవహారం



ముక్కెళ్ళపాడు అసైన్డ్ భూములు

నూజెండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికోద్యోగులకు 2008లో పట్టాలు ఇచ్చిన ముక్కెళ్ళపాడు అసైన్డ్ భూములను తాము సాగు చేసుకుంటున్నామని గ్రామస్థులు తమకు కేటాయించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. దీంతో ఈ సమస్య జఠిలంగా మారుతోంది. దేశానికి సేవలందించిన తమకు ప్రభుత్వ చట్టపరంగా అందజేసిన భూముల్లో తాము సాగు చేసుకునేందుకు ఆటంకాలు లేకుండా చూడాలని మాజీ సైనిక ఉద్యోగులు కూడా అందరికీ వినతి పత్రాలు ఇచ్చారు. గురువారం తాము భూములు సాగు చేసుకుంటున్నామని గ్రామస్థులు సదరు భూముల్లో ఫొటోలు దిగి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇదిలా ఉండగా మాజీ సైనిక ఉద్యోగులు ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలసి తమకు న్యాయం చేయాలని కోరటంతో తహసీల్దార్ రమేష్ కుమార్‌కు సమస్యను సత్వరమే వివాదం లేకుండా పరిష్కరించాలని జీవీ ఆదేశించారు.

విచారించి హక్కులు కల్పిస్తాం : తహసీల్దార్

ముక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో వివాదంగా మారుతున్న భూములను పరిశీలించి విచారణ చేసి హక్కులు కల్పిస్తామని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ వివరించారు. గతంలో మాజీ సైనిక ఉద్యోగులకు భూములు కేటాయించి పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపకపోవటంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. సంబంధిత భూములను పరిశీలించి విచారణ చేస్తామని, ఎటువంటి వివాదాలు లేకుండా రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని గ్రామస్థులకు, మాజీ సైనికులకు సూచించామన్నారు.



అంకాళ పరమేశ్వరిని దర్శించుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

ఘనంగా కొచ్చర్ల అంకాళ పరమేశ్వరి తిరునాళ్ల

ఈపూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కొచ్చర్లలోని అంకాళ పరమేశ్వరి తిరునాళ్ల గురువారం కన్నుల పండుగగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్‌ల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం కొచ్చర్ల, కొండ్రముట్ల గ్రామస్థులు ఆరు విద్యుత్ ప్రభలను నిర్మించి సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. కొచ్చర్ల గ్రామస్థుల కోలాటం ఎంతగానో ఆకర్షించింది. ప్రభాకర్‌రావు ఈపూరు, బొల్లాపల్లి ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, బాలకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన చౌదరయ్య స్కూలు విద్యార్థులు

చిలకలూరిపేట, మే15 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పరీక్షా ఫలితాలలో పట్టణంలోని సాదినేని చౌదరయ్య పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ పరీక్షా ఫలితాలలో 51మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. సిహెచ్ సాయి శృతి 500 మార్కులకు గాను 449 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను స్కూలు సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పి వీరనారయణ, పాఠశాల సీఈవో ప్రత్తిపాటి సురేష్, డైరెక్టర్ రాజేష్, ప్రిన్సిపాల్ బాషా గురువారం అభినందించారు.



ధర్నాలో పాల్గొన్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, అధ్యక్షుడు వీ కృష్ణయ్య తదితరులు

పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

● కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

నరసరావుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన నల్లబర్లీ పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్ర నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద పొగాకు రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.హరిబాబు మాట్లాడుతూ పొగాకు కంపెనీ ప్రతినిధుల మాటలు నమ్మి నల్లబర్లీ తీరుతో ప్రభుత్వ విధానాలతో నిలువునా మునిగిపోతున్నారని అన్నారు. నల్లబర్లీ పొగాకును కనీస మద్దతు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు కొనుగోలు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో వంద ఏళ్ళ చరిత్రలో పండించిన పొగాకులో 30శాతం మాత్రమే భారతదేశంలో వినియోగిస్తున్నారని, 70శాతం విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు జి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కె.రామారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు నాయక్, గుంటూరు విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

విడదల రజిని పాస్‌పోర్ట్ రెన్యూవల్ చేయండి

● పాస్‌పోర్ట్ అధికారికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీమంత్రి విడదల రజిని పాస్‌పోర్టును రెన్యూవల్ చేయాలని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిని హైకోర్టు ఆదేశించింది. రజినిపై దాఖలైన నాలుగు క్రిమినల్ కేసులు విచారణ దశలోనే ఉన్నాయని, చార్జ్‌షీట్ దాఖలు చేయలేదని గుర్తుచేసింది. దర్యాప్తు దశలో ఉన్న కేసులు పాస్‌పోర్ట్ జారీ/రెన్యూవల్‌కు అడ్డంకి కాబోవని సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టు ధర్మాసనం తీర్పులు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రజిని పాస్‌పోర్ట్ రెన్యూవల్ చేయాలని పాస్‌పోర్ట్ అధికారులకు స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. పాస్‌పోర్టు రెన్యువల్ చేసేలా విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిని ఆదేశించాలని కోరుతూ విడదల రజిని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఆమె తరఫున న్యాయవాది నర్సిరెడ్డి వాదనలు వినిపించారు.

నూజెండ్లలో కుంటుపడుతున్న అభివృద్ధి

● వేధిస్తున్న సిబ్బంది కొరత, సమన్వయ లోపం

నూజెండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సిబ్బంది సమన్వయంగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉండగా వీరి మధ్య సమన్వయం లేక అభివృద్ధి కుంటుపడుతోంది. మండల అభివృద్ధి అధికారిగా పీ ఉమాదేవి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సమన్వయం కొరవడి మండల అభివృద్ధికి విఘాతం కలిగిందని పలువురు మండల నాయకులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో తీరుతో ఉద్యోగులు సెలవు పెట్టగా సీనియర్ అసిస్టెంట్ ఇటీవల పదవీ విరమణ చేశారు. ఈవోపీఆర్‌డీ, అడ్మినిస్ట్రేటివ్ పరిపాలన అధికారి, ఇతర మండల శాఖ అధికారులు కూడా లేకపోవటంతో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. గ్రామంలో గతంలో చేసిన పనులకు ఎం బుక్‌లు చేయాలని, 15వ ఆర్థిక సంఘం నిధులతో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేస్తూ తీర్మానాలు చేయాలని, ప్రజా ప్రతినిధులు, నాయకులు చేస్తున్న విజ్ఞప్తులను ఎంపీడీవో లక్ష్య పెట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిదులకు, నాయకులకు మండల కార్యాలయంలో ప్రతినిత్యం వాగ్వివాదాలు జరుగుతున్నాయి. ఉపాధి హామీ సిబ్బందికి సకాలంలో జీతాలు అందకపోవటం, ఎంపీడీవో వ్యవహార శైలిపై మండల నాయకులు ఇటీవల వినుకొండలో జరిగిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో, అనంతరం ఉన్నతాధికారులకు మరోమారు ఫిర్యాదులు చేయటంతో ఎంపీడీవోకు నాయకుల మధ్య వివాదంగా మరింత ముదిరింది. సిబ్బంది ఎవ్వరూ లేకుండా ఎంపీడీవో ఒక్కరు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. జిల్లా అధికారులు నూజెండ్ల మండల అభివృద్ధి కార్యాలయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి అధికారులు, సిబ్బందిని నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కున్వర్ విజయ్ షాపై కఠిన చర్యలు తీసుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

చిలకలూరిపేట, మే15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో కీలక బాధ్యత నిర్వర్తించిన కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలుచేసిన బీజేపీ మంత్రి కున్వర్ విజయ్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకృష్ణ గురువారం డిమాండ్ చేశారు. కున్వర్ విజయ్ షా మీద కఠిన చర్యలు తీసుకోవాలని, మంత్రివర్గం నుండే కాకుండా శాసన సభ్యత్వం పై కూడా అనర్హత వేటువేసి బీజేపీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని రాధాకృష్ణ కోరారు.

నరసరావుపేట న్యాయవాద సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

నరసరావుపేట లీగల్, మే 15, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట న్యాయవాద సంఘ కార్యవర్గం 2025 -2026 సంవత్సరానికి సంబంధించి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నిక ప్రక్రియకు సంబంధించి గురువారం నామినేషన్లు ప్రారంభమయ్యాయి. నామినేషన్ సమయం ముగిసేసరికి అధ్యక్షుడిగా న్యాయవాది గన్నె వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా నున్న వెంకట నాగరాజు, కార్యదర్శిగా శ్రీరామనేని ప్రసాదులు, జాయింట్ సెక్రటరీ పదవికి గుండా రాజేష్‌కుమార్, కోశాధికారి పదవికి సునీల్‌సింగులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కొక్క పదవికి ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లను ఎలక్షన్ కమిషన్ ఆమోదించడంతో అన్ని పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ చైర్మన్ మోరా ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో ఎంపికైన అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, జీవీ సుబ్రహ్మణ్యం, కే.విజయ్ కుమార్‌లు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



పర్వీన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పర్వీన్ కుటుంబానికి అండగా ఉంటా

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): కూలిపనులకు వెళ్లి పిడుగుపాటుకు గురై మృతిచెందిన పర్వీన్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం కారుచోల గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ బుధవారం పొలంలో కూలిపనికి వెళ్ళి పిడుగుపడి మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ప్రత్తిపాటి గురువారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన భర్త సైదా, పిల్లలను ఓదార్చారు. పిడుగుపాటుకు గురై మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, రూ.4లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నదని త్వరలోనే ఆ మొత్తం కుటుంబానికి అందజేస్తామన్నారు. కేంద్ర కార్మికశాఖ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వారికి రూ.2లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నదని, పర్వీన్ వివరాలు నమోదై ఉన్నందున సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే ఆ కుటుంబానికి రూ.2లక్షలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మట్టి ఖర్చుల కింద బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.50వేలు అందజేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. నివాళులర్పించిన వారిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, టీడీపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డులో మహాలక్ష్మి అమ్మవారి ఆలయ మూడో వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 17వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. స్టేడియం వద్ద ఉన్న పెద్దమురుగు నీటి కాలువను ఎమ్మెల్యే అరవిందబాబు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున కాలువలో పూడికలు తీయాలని, మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● ఏఐటీయూసీ నాయకుడు శ్రీనివాసరావు

వినుకొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, కరెంటు సెక్షన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, కరెంటు సెక్షన్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని బూదాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండ్రముట్ల సుభాని, ఏసు, గాలెయ్య, మస్తాన్, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురం జడ్పీ పాఠశాలకు విరాళాన్ని అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సహకారం

శావల్యాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు పూర్వవిద్యార్థులు తమవంతు సహకారాన్ని అందించడం అభినందనీయమని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలకు రూ.20వేలు విరాళాన్ని గురువారం ఎంఈవో సాంబశివరావు, పాఠశాల స్థలదాతలు పద్మనాభుని హనుమంతరావు, గట్టుపల్లి సత్యనారాయణల చేతులమీదుగా హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మికి అందజేశారు. పాఠశాల్లో క్రీడావిభాగానికి మరో రూ.7వేలను పీడీ రాగుల రాధాకృష్ణమూర్తికి అందజేశారు. ఇటీవల బాల్‌బ్యాడ్మింటన్‌లో అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు ఎంపికైన బొందిలిపాలేనికి చెందిన విద్యార్థిని రావినూతన రత్నకీర్తనకు 1999-2000 బ్యాచ్ పూర్వవిద్యార్థులు రూ.3500 విలువజేసే బ్యాల్‌బ్యాడ్మింటన్ రాకెట్‌ను కానుకగా ఇచ్చారు. పాఠశాలల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులంతా భాగస్వాములవడం శుభపరిణామమని హెచ్‌ఎం విజయలక్ష్మి కొనియాడారు.